
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ; 29 ; జూన్ ; 2024



ఘనంగా నిత్య కల్యాణం
సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. 8లో



కనకమ్మకు క్షీరాభిషేకం
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు 8లో



పెద్దేరుకు వరద తాకిడి
మాడుగుల మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద తాకిడి నెలకొంది. ఈకారణంగా నీటిమట్టం పెరుగుతోంది. 8లో

న్యూస్‌రీల్

మహిళల రక్షణకు ప్రత్యేక కమిటీలు

- పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

పాడేరు : మహిళలు పనిచేసే ప్రదేశాలలో ఎటువంటి లైంగిక వేధింపులకు గురికాకుండా అరికట్టే దిశగా రక్షణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదిమంది ఉద్యోగులు ఉన్న ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో ముగ్గురు సభ్యులతో కూడిన అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసి నివేదికలు అందజేయాలన్నారు. అన్ని మండలాల కార్యాలయాల్లో కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15 హెచ్ ప్రకారం గౌరవంగా జీవనం, అభ్యసించే హక్కు, లైంగిక వేధింపులకు గురి కాకుండా సురక్షిత వాతావరణం కలిగి ఉండే హక్కులను పొంది ఉన్నారని చెప్పారు. అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమోన్నత పాఠశాలలో సౌకర్యాల కల్పన



ఓపెన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న సీఐ రమేష్, అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్‌కుమార్

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి ఆర్మ్‌డ్ అవుట్‌పోస్టు అధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు స్థానిక సీఐ రమేష్, సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్‌కుమార్ తెలిపారు. నుర్మతి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్మించిన థియేటర్, ఓపెన్ ఆడిటోరియంను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బాలికలు, యువతను ప్రోత్సహించేందుకు సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్, ఏపీఎస్పీ పోలీసులు సంయుక్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్, ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, హెచ్‌ఎం బి.రూపవతి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ పాల్గొన్నారు.

సాధనతోనే ఉన్నత శిఖరాలు

- వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హాసిని



విద్యార్థినులతో మాట్లాడుతున్న హాసిని

గంగవరం : క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, సాధన చేస్తే ఏదైనా సాధించగలమని వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.హాసిని అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమబాలికోన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలను పరిశీలించారు. గతంలో సహాయ గిరిజన సంక్షేమాధికారిగా పనిచేసిన హాసిని గత ఏడాది గ్రూప్–1కు ఎంపికై మచిలీపట్నం వైద్యాఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. కొద్దిసేపు గిరిజన విద్యార్థినులతో మాట్లాడారు. సూచనలిచ్చారు.

పర్యాటకులు మెచ్చేలా..
ఆహ్లాదం పంచేలా..



మన్యంలో సీజన్ ఏదైనా ప్రకృతి అందాలు కనువిందు చేస్తుంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో తీరిక దొరికినప్పుడల్లా ఇక్కడ గడిపేందుకు పర్యాటకులు ప్రాధాన్యమిస్తుంటారు. అందుకు తగ్గట్టుగా అరకు పరిసరాల్లో సరికొత్త ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. దీనిలో భాగంగా పర్యాటకులను ఆకర్షించేలా.. గిరిజనులకు ప్రయోజనం కల్పించేలా సీతాకోక చిలుకల పార్కు, కాఫీ హౌస్ ఏర్పాటువుతోంది.

- సీతాకోక చిలుకల పార్కు నిర్మాణం
- అటవీ వనంలో కాఫీ హౌస్ ఏర్పాటు
- పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ సహకారం
- రూ.5.5 కోట్లతో పనులు
- అటవీ సంరక్షణ.. గిరిజనులకు ఆర్థిక ప్రయోజనమే లక్ష్యం



ప్రకృతి అందాలు తిలకించేలా ఎత్తులో ఉన్న చాపరాయి కొండ

అనంతగిరి: అటవీ పర్యాటకంలో భాగంగా ప్రకృతి వనంలో రూపుదిద్దుకుంటున్న వాటిలో సీతాకోక చిలుకల పార్కు ఒకటి. అరకు– విశాఖపట్నం ప్రధానరోడ్డును ఆనుకుని మర్దగుడ చాపరాయి సమీపంలో పది హెక్టార్లలో దీనిని అటవీశాఖ నిర్మిస్తోంది. ఇందుకు పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ రూ.5.5 కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో ప్రాజెక్టు పనులు వేగవంతం చేశారు. సందర్శకులను ఆకట్టుకునేలా దీనికి అనుబంధంగా కాఫీహౌస్ నిర్మాణం జరుగుతోంది.

లక్ష్యమిదీ..

- ఇక్కడ పర్యావరణ – పర్యాటక నిర్వహణకు స్థానిక గిరిజనులకు శిక్షణ అందించనున్నారు. ప్రాజెక్టు మొత్తం ప్రయోజనాల్ని గిరిజనులే పొందుతారు.
- ఎకో టూరిజం సెంటర్ నుంచి వచ్చే ఆదాయాన్ని సెంటర్ నిర్వహణతో పాటు స్థానిక గిరిజనుల అభివృద్ధికి, అటవీ, వన్యప్రాణుల పరిరక్షణకు వినియోగించనున్నారు.
- అడవుల్ని నాశనం చేయకుండా జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తూ పర్యాటకులకు ఆకట్టుకోవడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం.
- ఈ సెంటర్లో ఎకో కాటేజీలు, నాన్–టింబర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ప్రాసెసింగ్ సెంటరును నిర్మించనున్నారు.
- వీటితో పాటు ఓపెన్ బటర్ ఫ్లై గార్డెన్, ఆర్కిడేరియం, ఔషధ మొక్కల వనం, వాచ్ టవర్ ఏర్పాటు చేయనున్నారు.
- సీతాకోక చిలుకలకు సంబంధించి మకరందం కోసం గ్రోలే పుష్ప జాతుల పెంపకం చేపట్టనున్నారు.
- తూర్పు కనుమల్లోని జీవవైవిధ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టడీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.
- ప్రజలకు సేంద్రియ, స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులను అందించేలా చిన్న చిన్న వ్యాపార సముదాయాలు కూడా రానున్నాయి. ఇందులో పనస, చింతపండు, ఔషధ మొక్కలు, ఏజెన్సీలో దొరికే అరుదైన పండ్లు, మొక్కలను విక్రయించనున్నారు.
- పార్కు నిర్వహణపై రాష్ట్ర అటవీ శాఖ గిరిజనులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనుంది

ప్రత్యేక ఆకర్షణగా..

సీతాకోక చిలుకల పార్కులో పర్యాటకుల కోసం ఏర్పాటుచేస్తున్న కాఫీహౌస్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. వనాల మధ్య కాఫీ సేవించే సౌలభ్యం మన్యంలో ఎక్కడా లేదు. చల్లని వాతావరణంలో పర్యాటకులు మధురానుభూతి పొందేలా కాఫీ వనాల మధ్య దీనిని నిర్మిస్తున్నారు. మరికొద్దిరోజుల్లో అందుబాటులోకి రానుంది.

- పార్కు వద్ద రూ.10 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పార్కులో తాగునీటికి సంబంధించి గ్రావిటీ పథకాన్ని నిర్మించారు. వర్షం నీరు భూమిలో ఇంకిపోయేలా రాక్ ఫిల్ డ్యామ్‌లు నిర్మించారు.

చాపరాయి కొండకు ప్రాధాన్యం

సీతాకోక చిలుకల పార్కు అభివృద్ధి చేస్తున్న ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న చాపరాయి కొండకు ప్రాధాన్యం పెరగనుంది. గతంలో దీనికి పిక్నిక్ స్పాట్‌గా గుర్తింపు ఉండేది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంతో సందర్శకుల రాక తగ్గంది. ఇప్పుడు అటవీశాఖ ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ఈ ప్రాంతానికి పర్యాటకుల రాక పెరగనుంది. పార్కును ఆనుకుని చాపరాయి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. చాపరాయి ఎత్తయిన ప్రదేశంలో ఉండడంతో చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను వీక్షించవచ్చు.

ఆమోదం వచ్చిన వెంటనే పనులు

సీతాకోక చిలుకల పార్కు అభివృద్ధి పనులకు సంబంధించి అటవీశాఖ నుంచి పరిపాలనా పరమైన ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాం. ఇది కార్యరూపం దాల్చిన వెంటనే మిగతా పనులను వేగవంతం చేస్తాం. పర్యాటకులకు మరుపురాని అనుభూతిని మిగిల్చేలా పార్కు రూపుదిద్దుకుంటుంది.

– దుర్గాప్రసాద్,రేంజర్, అనంతగిరి



సీతాకోక చిలుకల పార్కుకు నిర్మించిన రోడ్డు



అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని కాఫీతోటల మధ్యలో నిర్మిస్తున్న కాఫీ హౌస్

నదిలో బాలుడు గల్లంతు



బాలుడు సింకు

చింతూరు: మండలంలోని కొత్తపల్లి వద్ద సీలేరు నదిలో ఒడిశాకు చెందిన ఐదేళ్ల బాలుడు శుక్రవారం గల్లంతయ్యాడు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా మడతల్‌కు చెందిన సోయం ముఖేష్ కుటుంబం శుభకార్యం నిమిత్తం కొత్తపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో గ్రామంలోని సీలేరు నదిలో స్నానాలకు దిగిన సమయంలో అతని కుమారుడి ఐదేళ్ల సింకు గల్లంతయ్యాడు. బాలుడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, గ్రామస్తులు రాత్రి వరకు గాలించినా లభ్యం కాలేదు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన దినేష్‌కుమార్‌ను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో ఉన్న ఏకలవ్య మోడ్రన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో సీట్లు పెంచాలని కోరారు. పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ కల్పించాలని కోరారు.సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఔట్ సోర్సింగ్ టీచర్లకు న్యాయం చేయాలి

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పణ



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: ఏపీ గిరిజన గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రెన్యువల్ చేసి విద్యార్థుల చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో గత 15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని చెప్పారు. గెస్ట్ టీచర్స్‌గా ఉన్న వీరిని ఔట్‌సోర్సింగ్‌లో కలపడం ద్వారా తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వీరిని రెన్యువల్ చేయాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ చేయలేదన్నారు. వీరు పనిచేస్తున్న గురుకులాల్లో పోస్టులను ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో ఖాళీగా చూపిస్తోందని తెలిపారు. వీరికి డీఎస్సీ ద్వారా కాకుండా రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలన్నారు. గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తాను ఉద్యమిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పాపికొండల పర్యాటకానికి అనుమతి

వీఆర్‌పురం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో నిలిచిపోయిన పాపికొండలు పర్యాటకం పునరుద్ధరణకు అధికారులు అనుమతులు జారీ చేశారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ శుక్రవారం తెలిపారు. తుపాను ప్రభావం కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాపికొండల పర్యాటకాన్ని ఈనెల 26 నుంచి నిలిపివేయడం తెలిసిందే. దీంతో మండలంలోని పోచవరం బోట్‌పాయింట్, దేవీపట్నం మండలం పోచమ్మగండి బోటపాయింట్ల నుంచి పాపికొండల వీక్షణకు వెళ్లే బోట్లన్నీ మూడు రోజుల పాటు తాత్కాలికంగా నిలిచిపోయాయి. తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టడంతో అధికారులు బోటింగ్‌కు అనుమతి జారీ చేశారని శనివారం ఉదయం నుంచి బోట్లు పాపికొండలకు వెళతాయని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ రాజేష్ తెలిపారు.

పిడతమామిడి పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు

- ఉత్తమ ప్రమాణాలతో సేవలు
- గుర్తించిన ఎన్‌క్యూఏఎస్ బృందం



ప్రత్యేక గుర్తింపు లభించిన సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

గంగవరం : మండలంలోని పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యత ప్రమాణాలతో అందిస్తున్న సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన ఎన్‌క్యూఏఎస్ సంస్థ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు) బృందం జిల్లాలో గత ఫిబ్రవరి 16,17 తేదీల్లో పర్యటించింది. దీనిలో భాగంగా బృందం సభ్యులైన డాక్టర్ శిల్పి (కేరళ), డాక్టర్ పొల్లురాజ్(తమిళనాడు), డా.రాఖేష్, డా.లలిత (న్యూఢిల్లీ) పీతమామిడి పీహెచ్‌సీని పరిశీలించారు. ఇక్కడ అందించే వైద్య సేవలు, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగం, లేబర్ రూమ్, లేబరేటరీ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, సాధారణ పరిపాలన విభాగం పనితీరును వారు పరిశీలించారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో అందుతున్న సేవలను బృందం సభ్యులు గుర్తించడంతో జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందిని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జమాల్‌బాషా, ఏడీఎంహెచ్‌వో శిరీష, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీ రామతులసి, సర్పంచ్ మరిడమ్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, గంగవరం పీహెచ్‌సీ వైద్యులు భావన తదితరులు అభినందించారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ దినేష్‌కుమార్
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించి మీకోసం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో పద్మావతితో కలిసి ప్రజల నుంచి 122 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం పోర్టల్ నిర్వహణపై అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. వరదలకు వంతెనలు, కల్వర్టులు దెబ్బతినకుండా తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో గిరిజనులు వాగులు దాటకుండా అవగాహన కల్పించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఐటీడీఏలో సాధారణ పరిపాలన విభాగం, సహాయ ప్రాజెక్టు అధికారుల ఛాంబర్లు, ప్రాజెక్టు అధికారి ఛాంబర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ ఈఈలు డీవీఆర్‌ఎం రాజు, వేణుగోపాల్, ఎస్‌డీసీ శర్మ, వ్యవసాయ శాఖ అధికారి నందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ మురళి పాల్గొన్నారు.

భారీగా వర్షాలు.. ఉధృతంగా వాగులు

- అటవీ ప్రాంతంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలపై కూలిన చెట్లు
- యుద్ధప్రాతిపదికన తొలగించి సరఫరా పునరుద్ధరించిన అధికారులు



విద్యుత్ లైన్‌ను పునరుద్ధరిస్తున్న సిబ్బంది



ధారకొండ ఘాట్ రోడ్లో విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. మత్స్యగెడ్డ, రాళ్లగెడ్డ, కురిడిగెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాడేరు పట్టణంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. వర్షాకాలం నేపథ్యంలో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలిచ్చారు.

622 ఎంఎం వర్షపాతం

జిల్లాలో శుక్రవారం 622 ఎంఎం వర్షపాతం నమోదైందని కలెక్టరేట్ అధికార వర్గాలు తెలిపాయి. జీకే వీధిలో 184.8, అరకులోయలో 66.4, కొయ్యూరులో 43.8, రాజవొమ్మంగిలో 43.6, మారేడుమిల్లిలో 31.6, రంపచోడవరంలో 28.2, అడ్డతీగలలో 24.4, ముంచంగిపుట్టులో 22.8, పెదబయలులో 21.6, డుంబ్రిగుడలో 20.8, గంగవరంలో 16.2, హుకుంపేటలో 15.2, అనంతగిరిలో 14.6, హుకుంపేటలో 15.2, పాడేరులో 13.8, దేవీపట్నంలో 14.2, ఎటపాకలో 12.2, చింతూరులో 11.4, వై.రామవరంలో 10.6, చింతపల్లిలో 9.6, జి.మాడుగులలో 4.2, వీఆర్‌పురంలో 1.6 ఎంఎం వర్షపాతం నమోదైందని తెలిపాయి.

విద్యుత్‌లైన్లపై చెట్ల తొలగింపు

గూడెంకొత్తవీధి: మండలంలో గత రెండు రోజులుగా పెనుగాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న విద్యుత్ లైన్లను మెరుగుపరచి సరఫరాను పునరుద్ధరించారు. ఈదురుగాలులకు ధారకొండ అటవీ ప్రాంతంలో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. చెట్లు కూలడంతో ధారకొండ, దుప్పిలవాడ పంచాయతీల్లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వీరు రెండు రోజులుగా చీకట్లోనే మగ్గాల్సి వచ్చింది. ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు.విద్యుత్‌లైన్లపై కూలిన చెట్లు, కొమ్మలను చింతపల్లి ఏఈ ప్రభాకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. దెబ్బతిన్న స్తంభాలను మెరుగుపరిచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



హుకుంపేట రాళ్లగెడ్డలో పెరిగిన ప్రవాహం

మలేరియా నియంత్రణకు చర్యలు

సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ



నిల్వ నీటిని సిబ్బందితో తొలగిస్తున్న ఏఎంవో, సబ్ యూనిట్ అధికారి నీలకంఠం నాయుడు

కొయ్యూరు: మలేరియా కేసుల తగ్గుదలకు చర్యలు చేపట్టామని సహాయ మలేరియా అధికారి(ఏఎంవో) సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి నీలకంఠం నాయుడు తెలిపారు. శుక్రవారం వారు రాజేంద్రపాలెం గ్రామాన్ని సందర్శించారు. డ్రైడే పాటిస్తున్నది లేనిది తెలుసుకునేందుకు కొన్ని ఇళ్లను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న పాత్రలను గమనించారు. వాటి వల్ల దోమల ఉధృతి పెరుగుతుందని సూచించారు. వెంటనే నిల్వనీటిని తొలగించడమే కాకుండా ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డౌనూరు ఆరోగ్య కేంద్రంలో 42 మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. రాజేంద్రపాలెంలో 14, యూ చీడిపాలెంలో 10, కంఠారంలో 8 కేసులు చొప్పున 74 మలేరియా పాజిటివ్ నమోదు అయ్యాయన్నారు. ఈ పరిస్థితుల్లో మలేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి ఆగస్టు 15 వరకు 45 రోజుల పాటు మండలంలో ఎంపిక చేసిన 104 గ్రామాల్లో ఏసీటీ ఐదు శాతం మందును పిచికారిచేస్తారన్నారు. చాలా మంది మందును ఇంటిలోపల పిచికారి చేయించుకోవడం లేదన్నారు. దీని మూలంగా దోమలు పెరిగి మలేరియా ఉధృతి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిలోపల కూడా పిచికారి చేయించుకోవాలని సూచించారు. వరుసగా నాలుగు సంవత్సరాల పాటు గ్రామాల్లో నమోదైన కేసుల ఆధారంగా అక్కడ పిచికారి చేస్తామన్నారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడంతోపాటు ఫాగింగ్ చేయాలని ఆదేశించారు.

ఆదివారం.. విద్యుత్ బిల్లుల స్వీకరణ

పాడేరు : విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని విద్యుత్ శాఖ కలెక్షన్ కౌంటర్లు ఈనెల 30 ఆదివారం కూడా పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్. మహేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఆదివారం విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ శాఖ కార్యాలయాలు, ఈసేవ, మీసేవ కేంద్రాలతో పాటు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించుకోవచ్చన్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ కల్పించిన ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఘనంగా నిత్య కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూరులు గోవిందరాజస్వామి,శ్రీ దేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పెద్దేరుకు వరద తాకిడి

మాడుగుల రూరల్: రావిపాలెం వద్ద గల పెద్దేరు జలాశయం నీటిమట్టం శుక్రవారం 136.40 మీటర్లు ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు. జలాశయం పరిసర ప్రాంతంలో 35 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షాలకు 250 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. స్పిల్‌వే గేట్ల ద్వారా 188 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కనకమ్మకు క్షీరాభిషేకం



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891–2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

'డీజీ యాత్ర' రెడీ

- మొబైల్‌లో సాఫ్ట్ కాపీతో నేరుగా ఎయిర్‌పోర్టులోకి..
- ఫేస్ రీడింగ్‌తో తగ్గనున్న చెకింగ్ పాయింట్లు
- విమాన ప్రయాణికులకు కలిసి రానున్న సమయం
- విశాఖ విమానాశ్రయంలో మొదలైన ట్రయల్ రన్
- త్వరలోనే పూర్తి స్థాయిలో అమలుకు సన్నాహాలు



ఎయిర్‌పోర్టులో డీజీ యాత్ర గేట్లు

సాక్షి, విశాఖపట్నం: విమాన ప్రయాణికులు ఇకపై మునుపటిలా ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు. విమానం ఎక్కడానికి గంటన్నర, రెండు గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవలసిన పని లేదు. వివిధ తనిఖీల కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టే 'డీజీ యాత్ర' సదుపాయం విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో అందుబాటులోకి వస్తోంది. దీంతో ప్రయాణికులకు వివిధ రకాల చెక్‌ల నుంచి ఉపశమనం కలగనుంది. డిపాచర్ పాయింట్ వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది బోర్డింగ్ పాస్, గుర్తింపు కార్డును తనిఖీ చేస్తుంటారు. ఇకపై డీజీ యాత్రతో మొబైల్ ఫోన్‌లో సాఫ్ట్ కాపీని చూపించి నేరుగా ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించే వీలుంటుంది. ఈ డీజీ యాత్ర కాగిత రహిత ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. దేశంలోని 12 ఎయిర్‌పోర్టుల్లో డీజీ యాత్ర సదుపాయాన్ని అమలు చేస్తున్నారు. వీటిలో మన విశాఖ విమానాశ్రయం కూడా ఉంది. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చించారు. ఈ 'డీజీ యాత్ర' వల్ల విమానాశ్రయంలో ప్రయాణికుల డిజిటల్ ప్రాసెసింగ్ ద్వారా చెక్ పాయింట్ల వద్ద ముఖ గుర్తింపు వ్యవస్థ ఆధారంగా ప్రాసెస్ చేయబడతారు. దీంతో ఎంట్రీ పాయింట్ చెక్, సెక్యూరిటీ చెక్‌లోకి ప్రవేశించడం, ఎయిర్‌క్రాఫ్ట్ బోర్డింగ్ వద్ద గేట్లు తెరుచుకుంటాయి. ఇంకా ప్రయాణికుల డేటా రీకాల్‌ను గుర్తించడానికి ముఖ గుర్తింపు ద్వారా సెల్ఫ్ బ్యాగ్ డ్రాప్, చెక్ ఇన్‌ను కూడా సులభతరం చేస్తుంది. ఇలా బహుళ పాయింట్ల వద్ద గుర్తింపు తనిఖీని నివారిస్తుంది.

డీజీ యాత్ర పనితీరు ఇలా..

ప్రవేశ ద్వారం ఈ–గేటు వద్ద ప్రయాణికుడు తన బోర్డింగ్ పాస్ లేదా ఈ–టికెట్ (మొబైల్‌లో ప్రింట్ లేదా సాఫ్ట్ కాపీ) స్కాన్ చేస్తుంది. బార్ కోడ్/క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేశాక సిస్టం ప్రయాణికులు, విమాన వివరాలను ధ్రువీకరిస్తుంది. డీజీ యాత్ర ఐడీ ముఖ గుర్తింపు ద్వారా గుర్తింపును ధ్రువీకరిస్తుంది. టికెట్, డీజీ యాత్ర ఐడీ సక్సెస్ అయినట్టు నిర్ధారణ అయ్యాక ఈ–గేటు తెరవబడుతుంది. ఎయిర్‌పోర్టులో మిగిలిన ప్రయాణానికి టికెట్ పీఎన్ఆర్‌తో ముఖం ఒకే టోకెన్‌లో తయారు చేయబడుతుంది. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టంలో ఈ–గేట్ ద్వారా ప్రయాణికుడు సెక్యూరిటీ ఏరియా, ఎయిర్‌క్రాఫ్ట్ బోర్డింగులోకి ప్రవేశానికి వీలవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

ప్రయాణికులు ఇదివరకు మాదిరిగా బహుళ చెక్ పాయింట్ల వద్ద బోర్డింగ్ పాస్ లేదా ఐడీని చూపించాల్సిన అవసరం లేదు. కనీస మానవ జోక్యంతో క్యూలో నిల్చునే సమయం బాగా తగ్గుతుంది. ప్రయాణికులను పీఎన్ఆర్‌తో మ్యాప్ చేస్తుంది.. కాబట్టి భద్రత మెరుగు పడుతుంది. ప్రతి చెక్ పాయింట్ వద్ద సిసలైన ప్రయాణికులను మాత్రమే అనుమతిస్తుంది. ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌కు ప్రయాణికుల లోడ్‌పై నిర్దిష్ట సమయ సమాచారం ఉంటుంది. వీటన్నిటి ఫలితంగా విమాన ప్రయాణికుడు వేచి ఉండే సమయం, ప్రయాస చాలా వరకు తప్పుతుంది. అంటే ఎయిర్‌పోర్టులో పట్టే సమయం 30 నిమిషాల నుంచి 5–10 నిమిషాలకు తగ్గుతుంది.

ట్రయల్ రన్ ప్రారంభం..



విశాఖ విమానాశ్రయంలో 'డీజీ యాత్ర'పై రెండు రోజుల క్రితం నుంచి ట్రయల్ రన్ చేపట్టాం. రోజుకు 100–150 మంది వరకు డీజీ యాత్ర ద్వారా వెళ్తున్నారు. డీజీ యాత్ర వినియోగానికి వీలుగా నాలుగు గేట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే డీజీ యాత్రను అధికారికంగా ప్రారంభిస్తాం. ఈ ఎయిర్‌పోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు రోజుకు సగటున నాలుగు వేల మంది ప్రయాణికులు వెళ్తుంటారు. ముమ్మందు వీరంతా డీజీ యాత్ర ద్వారానే పయనించే వీలుంటుంది.

– ఎస్. రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ ఎయిర్‌పోర్టు.

బేస్ లైన్ సర్వే కీలకం



మాట్లాడుతున్న ఉండవల్లి గాంధీబాబు

వీఆర్‌పురం: ప్రధాన మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా చేపట్టే ఆదర్శ గ్రామాల ఎంపిక ప్రక్రియలో బేస్‌లైన్ సర్వే ప్రక్రియ కీలకమని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు అన్నారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ వైజాగ్, ఏఎస్‌డీఎస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రేఖపల్లిలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి ప్రణాళికకు క్షేత్ర స్థాయిలో నిర్వహించే బేస్ లైన్ సర్వేపై ప్రతీఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.



గంగవరం ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్‌ను సన్మానిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు

ఆత్మీయ వీడ్కోలు

గంగవరం : గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగంలో మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలు అందించి ఈ నెల 30న పదవీ విరమణ చేయుచున్న పాఠశాల హెచ్‌ఎం బి.ఝాన్సీహేన్సన్ సేవలు అభినందనీయమని, ఉపాధ్యాయ లోకానికి ఆమె సేవలు ఆదర్శనీయమని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఝాన్సీ హేన్సన్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం సిబ్బంది నిర్వహించారు. ఈ సభలో మరో ముఖ్య అతిథి వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మచిలీపట్నం) ఎం.హాసిని మాట్లాడుతూ తాను ఇక్కడ సహాయ గిరిజన సంక్షేమాధికారిగా పనిచేసిన కాలంలో ఝాన్సీహేన్సన్ తన సేవల్లో ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించేవారని, ఆమె సేవలు, నిబ్బతను ఆదర్శంగా తీసుకున్నాన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం మాట్లాడుతూ గంగవరం, వేములోవ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి ఝాన్సీ హేన్సన్ ఎంతో కృషి చేశారన్నారు. గంగవరం ఆశ్రమ పాఠశాలను ఆదర్శప్రాయంగా తీర్చిద్దడంలో ఆమె కృషి ఉందన్నారు. వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, గోకవరం ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన, ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ తదితరులు ప్రసంగించారు. రంపచోడవరం మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, యూటీఎఫ్ నాయకులు రఘుబాబు, రాంబాబు, మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బిత్తరి సంతోష్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆర్.వి.వి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, బాలరాజు, పీడీ నాగమణి, హెచ్‌ఎం వరలక్ష్మి, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా సీనియర్ ఉపాధ్యాయురాలు ఉమాదేవి వ్యవహరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఐ.వి. వెంకటేశ్వరరావు ఫోన్ ద్వారా తన అభినందనలు తెలిపారు.

బాలలను పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

అనంతగిరి: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిదే బాధ్యత ఉపాధ్యాయులదేనని, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలోని ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన ప్రగాడ వెంకటరమణ చేశారు. పదవీ విరమణ సభలోని పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముందుగా ప్రగాడ వెంకటరమణ దంపతులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులు చేతుల్లో ఉంటుందన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ వృత్తి నుంచి తనకు ఈ విషయం తెలుసు అని చెప్పారు. 39 ఏళ్లగా గిరిజన ప్రాంతంలోని ఉపాధ్యాయ వృత్తిలో అనేక ఒడిదుడుకులను ఎదర్కొని, గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు నాంది పలికిన, ప్రగాడ వెంకటరమణ సేవలను మరువలేమన్నారు. రోడ్డు సౌకర్యాలు లేని సమయంలోని కాలినడకన సుదూర ప్రాంతాలు వెళ్లి పాఠాలు చెప్పి, నాటి విద్యార్థులు నేటి భవిష్యత్తుకు పునాదులు వేశారని కొనియాడారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్లు పాగి అప్పారావు, మజ్జి అప్పారావు, ఎంపీటీసీ మితుల, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలజీ పాల్గొన్నారు.



చిలకలగెడ్డ పాఠశాలలోని పదవీ విరమణ సభలో వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీపీ నీలవేణి

నేటి నుంచి సురభి నాటకోత్సవాలు



మాట్లాడుతున్న బాదంగీర్ సాయి

అల్లిపురం: భారతదేశ నాటకరంగ చరిత్రలో 140 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభి నాటకోత్సవాలు శనివారం నుంచి వారం రోజుల పాటు మద్దిలపాలెం కళాభారతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాదంగిర్ సాయి, సీనియర్ జర్నలిస్టు నాగబోయిన నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు డాబాగార్డెన్స్, వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. శనివారం వచ్చే నెల 5వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6.15 గంటల నుంచి ప్రదర్శన ఉంటుందన్నారు. శనివారం మాయాబజార్, ఆదివారం భక్త ప్రహ్లాద, జూలై 1న లవకుశ, 2వ తేదీన భూకైలాస్, 3వ తేదీన పాతాళభైరవి, 4వ తేదీన శ్రీకృష్ణ లీలలు, 5వ తేదీన మరోసారి మాయాబజార్ నాటకాన్ని కళాభారతి వారి సౌజన్యంతో ఆ రోజు ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులుగా బాదంగిర్ సాయి, సీనియర్ జర్నలిస్టు నాగబోయిన నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ఎస్ఆర్‌కే ఇన్ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు, కంచర్ల అచ్యుతరావు, కళా హాస్పటల్ డాక్టర్ పీవీ రమణమూర్తి, వీవీ వామనరావు, వీవీ రమణమూర్తి, డాక్టర్ సూరపనేని విజయ కుమార్, మావూరి వెంకటరమణ, పైడా కృష్ణ ప్రసాద్ సహకారంతో సురభి నాటకోత్సవాలను ఏర్పాటు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ నాటకాల్ని తిలకించేందుకు ఏ విధమైన ప్రవేశ రుసుం లేదన్నారు. అందరూ ఆహ్వానితులే అన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎం. పోలినాయుడు శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

డిప్లొమా కోర్సులో ప్రవేశానికి వెబ్ ఆప్షన్లు



డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం: జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌ను ఇచ్చుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి శుక్రవారం తెలిపారు. జూన్ 30వ తేదీ నుంచి జూలై 4వతేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని మొదటి విడతలో సీటు రాని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్‌లో ఎంచుకునేవారికి జూలై 5వ తేదీ నుంచి 7వతేదీ వరకు సీట్లు కేటాయింపులు ఉంటాయని, జూలై 9వ తేదీ నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలనలు జరుగుతాయని తెలిపారు.

జాబ్‌మేళాకు స్పందన

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి (ఎంప్లాయ్‌మెంట్) అధికారి శాంతి (టెక్నికల్) తెలిపారు. ఆరు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 300 ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 105 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 50 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శాంతి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ సుబ్బిరెడ్డి, జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, ఐటీఐ, అప్రెంటిస్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.